# సినిమా కడుపుతీపి

## — హైమా భార్గవ



శాంత కళ్ళల్లో నీళ్ళూ, నివ్వలూ ఒకేసారి కనబడే సరికి సుధాకర్ తల దించుకున్నాడు.

"మీరేనా ఇలా మాట్లాడేది?" కంటతడిపెడుతూ అంది శాంత.

"నేనో విలన్నయినట్లు అలా అంటావేం? కొస్త స్థిమితంగా ఆలోచించు. ఇంతకంటే మంచి అవ కాశం రాదు" అన్నాడు సుధాకర్.

"ఆలోచించాల్సిన అవసరం లేదు. బిడ్డను దూరళ చేసుకునేందుకు ఏ తల్లి ఒవ్వకోదు" కోపంగా అంది శాంత.

"సినిమా డైలాగులు చెప్పకు" చిరాగ్గా అన్నాడు సుధాకర్."

" మీ భార్యనే కదా. మీ కథల డైలాగులే వస్తాయి..." కసిగా అంటున్న భార్య మాట లకు ఆవేశంగా పైకిలేచి, ఎలాగో తనను తాను నిభాయించుకుని విసురుగా ఇంట్లోనుంచి బైటికి నడిచాడు సుధాకర్.

మంచం మీద నిద్రపోతున్న పిల్లలను చూస్తుంటే శాంతకు కన్నీరాగడం లేదు. ముగ్గురిలోను ముద్దులు మూటగట్టే ఏడేళ్ళ రాజీవ్‌ను చూస్తూ వాడి పక్కనే పడుకుని, బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది. ఇంత చక్కటి బిడ్డనా పరాయి వాళ్ళకు ఇవ్వాలనుకునేది...

ఇన్నేళ్ళ వైవాహిక జీవితంలో ఏ రోజూ తనూ, సుధాకర్ ఘర్షణ పడలేదు. సుధాకర్‌లో ఆవేశం పాలు కాస్త ఎక్కువే. ఆ విషయం తెలిసిన తను కాస్త ఓర్పుగానే వ్యవహరిస్తుంది. అందుకే ఆవేశం తగ్గగానే సుధాకర్ సారీ చెప్పి తప్పను ఒప్పుకుంటాడు. కానీ ఇప్పుడు కళ్ళముందు భూతంలా నిలబడ్డ సమస్యతో భవిష్యత్తంటే తనలో భయాన్నే కలిగిస్తోంది. మూడు రోజులుగా తమ మధ్య ఇంతటి అశాంతిని అడ్డు గోడలా నిలబెట్టిన భాస్కర్ మీద విపరీతమైన కోపం వచ్చింది శాంతకు.

మూడు రోజుల క్రితం సుధాకర్ బాల్య స్నేహితుడు భాస్కర్ అమెరికా నుండి వచ్చాడు. అతను హైదరాబాదుకు రాగానే సధాకర్‌కు ఫోన్ చేశాడు. పదేళ్ల తర్వాత ఫ్రెండ్‌ను కలుసుకున్న సంతోషంలో సుధాకర్ గాలిలో తేలిపోయాడు.అతను తెచ్చిన బహుమతులను, చాక్లెట్లను చూసి పిల్లలు మురిసిపోయారు.

"ఎంతయినా నువ్వు చాలా అదృష్టవంతుడివిరా. నేనూ ఉన్నాను, ఎందుకూ? గొర్రెతోక బెత్తెడే అన్నట్లు ఎదుగూ బొదుగూ లేని జీవితం. ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు చెయ్యాలి. ఈ ముగ్గురి పిల్లల చదువులూ, డొనేషన్లూ, ఫీజులూ, ఆటోల ఖర్చులూ...!" అని నిట్టూర్చాడు సుధాకర్." ఇవన్నీ ఎవరికైనా వుండేవేరా. అందరికీ నా సంపాదన, వైభవం, కనబడతాయేగానీ నా దిగులు తెలీదురా" నిరుత్సాహంగా అంటున్న భాస్కర్ వైపు ఆశ్చర్యంగా చూశాడు సుధాకర్.

నీకు సమస్యలా? జోకొద్దు" అన్నాడు సుధాకర్.

ఏం? నేనుమాత్రం మనిషిని కానా? నాకు మాత్రం సమస్యలుండవా?" అన్నాడు భాస్కర్.

"నీలాంటి అదృష్టవంతుడే అలా అంటే మాలాంటి వాళ్ళు ఏమనుకోవాలి? అన్నాడు సుధాకర్.

"హుం. అదృష్టం. డబ్బులుంటే చాలా. ఇంకేమీ వద్దా, మీ పిల్లల్ని చూస్తుంటే ఎంత ముద్దొస్తున్నారో. వాళ్ళను చూస్తుంటే మాకు పిల్లలు లేని విషయం గుర్తొచ్చి చాలా బాధగా వుంది. నీ పిల్లలే నీ అన్నమకో" అన్నాడు భాస్కర్.

ఓ అదా సంగతి. పిల్లలు లేని వాళ్ళకు అపురూపంగా అనిపిస్తుందేమో కానీ వున్న వాళ్ళకు మాత్రం వాళ్ళతో వేగుతుంటే విసుగ్గా వుంటుంది. వీళ్ళను పెంచడం... ఆ టెన్షన్లు... ఇవన్నీ మనశ్శాంతి లేకుండా చేస్తాయి..." తేలిగ్గా అన్నాడు సుధాకర్.

"పిల్లలు వున్నవాడికి వాళ్ళ విలువ తెలియదు. లేనివాళ్ళు ఎంత బాధపడతారో మీకుతెలియదు. మీ పెద్దాడిని చూస్తుంటే ఎంతో ముద్దొస్తోంది. నాతో పంపిచరాదూ, పెంచుకుంటాను" అన్నాడు భాస్కర్.

"నిక్షేపంలా తీసుకెళ్ళు. నాకే అభ్యంతరం లేదు " అన్నాడు. సుధాకర్.

శాంత, సుధాకర్‌లు ఏదో నవ్వులాటకు భాస్కర్ అలా అన్నాడని అనుకున్నారు. కానీ భాస్కర్ ఇంటికి వెళ్తూ మరోసారి పిల్లల ప్రసక్తిని తీసుకొచ్చాడు:

"మీరు కాస్త సీరియస్‌గా ఆలోచించండి. రాజీవ్‌ను నాకు దత్తత ఇస్తే తీసుకుంటాను. మీఇద్దరు పిల్లల పేరుతో లక్ష రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేస్తాను. మీకు ఇబ్బందులొచ్చినపుడు పనికొస్తుంది. మీరు ఏ విషయం పది రోజుల్లో చెబితే నేను ఆ ఏర్పాట్లేవో చూసుకుంటాను" అన్నాడు.

భాస్కర్ వెళ్ళిపోయాక రాజీవ్‌ను దగ్గరకు తీసుకుని తెగ మురిసిపోయాడు సుధాకర్.

"చూశావా శాంత! మన రాజా ఎంత అదృష్టవంతుడో. అమెరికాకు వెళ్ళి అక్కడే హాయిగా, దర్జాగా బతికేందుకు ఎంత మంచి అవకాశం వచ్చిందో."

సుధాకర్ మాటలకు శాంత కలవర పడింది. "ఏమిటండీ నిజంగానే పంపించాలనుకుంటున్నారా? అదేం కుదరదు" అంది ఖచ్చితంగా.

"నువ్వు ఆవేశ పడకు శాంతా. కాస్త ఆలోచించు. నాలాంటి గుమాస్తా పిల్లలకు ఖరీదైన జీవితాన్ని ఇవ్వలేదు. మన ఇంటి పరిస్థితులు నీకు తెలుసు. నీక్కూడా ఉద్యోగం లేదు. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్లు, తమ్ముడి చదువు, మన పాప పెళ్ళి వున్నాయి. ఇద్దరు కొడుకులకు మంచి చదువులు చదివించాలంటే ఎంత కష్టమో ఆలోచించు. అదే పెద్దాడిని భాస్కర్‌తో పంపిస్తే వాడికి బెస్ట్ ఎడ్యుకేషన్ వస్తుంది. రాజాలా కార్లల్లో తిరుగుతాడు. అందుకేవాడిని దత్తతకు ఇచ్చెయ్యాలని నిర్ణయించుకున్నాను..."స్థిరంగా అన్నాడు సుధాకర్.

" నేను మాత్రం ఒప్పుకోను. వాడు లేకపోతే నేను బతకలేను..." అంది శాంత.

" చూడు శాంతా! రాజా మన దగ్గర లేకపోయినా మనకు ఇద్దరు పిల్లలున్నారు. వాళ్ళను చూస్తుంటే నీకు దిగులుండదు. అదే భాస్కర్‌కు పిల్లలే లేరు. అందుకే రాజాను అపురూపంగా



చూసుకుంటారు.

"అపురూపంగా చూసుకుంటారేమో కాని అమ్మలా చూసుకుంటారా? మన బిడ్డల్ని ఇంకొకరికి ఇచ్చేస్తే మనం సంతోషంగా వుండగలమా?

శాంతకు ఆవేశం, దుఃఖం ఒక్కసారిగా వచ్చి మౌనంగా కన్నీరు కారుస్తూ కూర్చుంది. సుధాకర్‌కు జాలేసింది.

"చూడు శాంతా! సంతోషం అనేది మన చేతుల్లో వుంటుంది. మనసు అద్దం లాంటిది. మనం నవ్వితే అది నవ్వుతుంది. మనం ఏడిస్తే అది ఏడుస్తుం." అన్నాడు.

"మీరు రాసే కథల్లో ఇలాంటి డైలాగులు రాస్తే బాగుంటుంది. ప్రాక్టికల్ లైఫ్‌లో ఇవన్నీ కుదరవు..." భర్త వైపు చురుగ్గా చూస్తూ అంది శాంత.

" భాస్కర్ ఇంకో పది రోజులుంటాడు. నువ్వు ఆలోచించే వ్యవధి వుంది. నీకు ఇష్టం లేకపోయినా నేను చేసేది చేస్తాను..." అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు సుధాకర్.

ఆరోజు సుధాకర్ చాలా సంతోషంగా వుండటం గమనించిన శాంతకు కారణం ఏమిటన్నది అర్థం కాలేదు. శాంతకు అసలు విషయం చెప్పాలని అనిపించినా అహం అడ్డు రావడంతో మౌనంగా వుండిపోయాడు సుధాకర్.

రాత్రి పన్నెండు గంటలు దాటినా తనతో మాటా పలుకూ లేకుండా సుధాకర్ ఏదో రాసుకోవడం చూసిన శాంతకు ఆ నిరసన వ్రతం బాధనూ, చిరాకునూ కలిగించింది. అతన్ని పలకరించకుండా మౌనంగా పడుకుంది.

సుధాకర్ మనసులో సంతోషం, ఆతృత పోటీ పడుతున్నాయి! సినిమా కంపెనీలో ప్రొడక్షన్ మేనేజర్‌గా వున్న తన ఫ్రెండ్ అశోక్ కుమార్ నుంచి ఫోన్ రావడమేంటి? ప్రముఖ సినీ దర్శకుడు గురుమూర్తికి మంచి సినిమా కథ కావాలనీ, స్టోరీ డిస్కషన్‌కు మర్నాడు రమ్మని చెప్పడం ఏమిటి? ఇదంతా కలిసి వస్తోన్న అదృష్టమే. తనకు ఎంతగానో నచ్చిన కథకు తుది మెరుగులు దిద్ది సంతృప్తిగా చదువుకున్నాడు సుధాకర్.

మర్నాడు అశోక్ కుమార్‌తో కూడా డైరెక్టర్ ఇంటికి వెళ్ళిన సుధాకర్‌కు ఒక ప్రముఖ నిర్మాతను పరిచయం చేశాడు డైరెక్టర్ గురుమూర్తి. పరస్పర పరిచయాలయ్యాక గురుమూర్తి సుధాకర్ వైపు చూసి " కథ వినిపించండి సార్! అన్నాడు... కాఫీ తాగండి సార్ అన్నంత తేలిగ్గా.

సుధాకర్ చెప్పిన కథ విని "కథ చాలా బాగుందండీ " అన్నారు నిర్మాత,డైరెక్టర్ కలిసికట్టుగా.

సుధాకర్‌కు చాలా సంతోషం కలిగింది. 'సినీ ఫీల్డులో ఒక్కసారి గుర్తింపు వస్తే చాలు. ఆ తర్వాత చాలా త్వరగా అవకాశాలొస్తాయి. అని కలలు కంటూ మురిసిపోయాడు.

బేరసారాలు. ముగిశాక కథకు ముప్ఫయ్ వేల దగ్గర సెటిలైంది.

డబ్బు చేతిలో పడగానే సుధాకర్‌కు చాలా సంతోషం కలిగింది. "ఎన్నేళ్ళ కల ఇది!" అని మనసులో మురిసిపోతూ వుంటే "సార్ !ఒక్క మాట" అన్నాడు డైరెక్టర్

"చెప్పండి సార్ !" అన్నాడు సుధాకర్.

"టైటిల్స్‌లో మాత్రం కథ మీ పేరుతో రాదండీ" అన్నాడు గురుమూర్తి.

సుధాకర్‌కు ఒక్కసారిగా మొహంమీద మరుగుతున్న నీళ్ళను కుమ్మరించినట్లయింది.

"ఎందుకండీ !" అన్నాడు ఆతృతగా

"ఏం లేదండీ. మీ స్టోరీ కేవలం బేస్ మాత్రమే. దీనికి ప్రొఫెషనల్ టచ్ ఇవ్వాలండీ."

"మీరు కథను డెవలప్ చెయ్యమంటే చేస్తాను సార్. అలవాటు చేసుకుంటేనే కదండీ ప్రొఫెషనల్ టచ్ వచ్చేది " సవినయంగా అన్నాడు సుధాకర్.

"మీరన్నది బాగుంది. కానీ అది మీలాంటి రచయితలకు పట్టుబడదు. ఇదొక సెపరేట్ డిపార్ట్‌మెంట్, మీ కథ మీ కథలా వుండదు. దానికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి."

"అంటే? " అర్థం కానట్లు చూశాడు సుధాకర్.

"లేని సీన్లు సృష్టించాలి. ఉన్నవి కొన్ని తీసెయ్యాలి. హీరో గారికి నచ్చేట్లు కొంత, హీరోయిన్‌కు నచ్చేట్లు కొంత మార్చాలి."

"అంటే నా కథ నేను రాసినట్లు వుండదా? "

"అబ్బే. అదేం లేదండీ. మెయిన్‌గా మీ కథే వుంటుందండీ."

"అయితే నా పేరే వెయ్యొచ్చుగా" ఆతృతగా అన్నాడు సుధాకర్.

"చూడండీ నా సినిమాల్లో కథ,స్క్రీన్ ప్లే, డైలాగులు. డైరెక్షన్ ఇవన్నీ నా పేరుతోనే వుంటాయి. అలా వేసుకుంటేనే ఆ సినిమా హిట్టవుతుందని నాకు సెంటిమెంటు. అందుకే కథ నా పేరుతోనే వస్తుంది " చిరునవ్వుతో అన్నాడు డైరెక్టర్.

"అయితే టైటిల్స్‌లో నా పేరు రాదా ! " బాధగా అన్నాడు సుధాకర్.

"రాదండీ. అయినా కథలోని మార్పులన్నీ నా బ్రెయిన్‌తోనే చేస్తున్నాను. అయినా సినిమాఫీల్డులో ఇది మామూలేనండీ.."

సుధాకర్ మొహంలోని అసంతృప్తిని చూసిన అశోక్ గబుక్కున లేచి నిలబడ్డాడు.. అక్కడే వుంటే సుధాకర్ ఏమంటాడో అనే భయంతో. "వస్తాం సార్. ఈ సారి ఇంకో మంచి స్టోరీ తెస్తామండీ " అంటూ సుధాకర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అతని బైటికి లాక్కొచ్చాడు.

ఈ ముప్ఫయ్ వేలు తనకు హాయ పడవచ్చుగానీ సంతృప్తిని మాత్ర ఇవ్వలేక పోయాయి. రేపు తన కథకు అవార్డ్ వచ్చినా అది తనకు దక్కదు. ఇంకెవడికో దక్కుతుంది. ఆ ఆలోచనే గుండెను కోస్తోంది..

ఏదో డబ్బులొచ్చే మార్గం చూసకోవాలి సుధా. ప్రిన్సిపుల్స్‌తో, సెంటిమెంట్లతో జీవితాన్ని దుర్భరం చేసుకోకూడదు. అయినా ఆడపిల్లను అత్తవారింటికి పంపించినట్లు అలా బాధ పడతావేంటి? రేపు నిజంగా నీ చెల్లికి పెళ్ళి చేస్తే ఇంకెంత బాధ పడతావో?" సుధాకర్‌ను నవ్వించే ప్రయత్నంలో పడ్డాడు అశోక్. ఆ మాటలు సుధాకర్ మనసు మీద కమ్చీ దెబ్బల్లా తగిలాయి. అతనికి తన ' పిల్లల తల్లి ' శాంత గుర్తొచ్చింది. తను కేవలం కథ విషయంలోనే ఇంత బాధ పడుతుంటే, కన్న కొడుకు విషయంలో శాంత ఇంకెంత బాధ పడిందో.

అప్పుడెప్పుడో తను రాసిన కవిత సుధాకర్‌కు జ్ఞాపకం వచ్చింది. " కవనం, శిశు జననం ఒక్కటే..." అంటూ మొదలు పెట్టి ఆ వేదన కన్న తల్లికే తెలుసు, కవికే తెలుసు..." అని రాశాడు.

తలుపు తీసిన శాంత మాట్లాడ కుండా వెళ్ళబోతుంటే ప్రేమగా దగ్గరకు తీసుకుని కవర్లోని డబ్బును ఆమె చేతిలో వుంచాడు.

"భాస్కర్ ఇచ్చిన డబ్బా?" నిరసనగా అంది శాంత.

"కాదు. నా సినిమా కథ కోసం వచ్చిన డబ్బు. రాజీవ్‌ను ఎవరికీ ఇవ్వను. మన పిల్లలు మన దగ్గరే వుంటారు. వాళ్ళే మన నిక్షేపాలు."

ప్రేమగా అంటున్న సుధాకర్ వైపు తడి కళ్ళతో, చిరునవ్వుతో చూసింది శాంత. ఆ చూపులో, నవ్వులో కనిపించిన కన్న తల్లి 'కడుపు తీపి' సుధాకర్‌ను మురిపించింది. ●